
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

గరిష్ఠం 30.0
కనిష్ఠం 22.0
***

నల్లగొండ

3

శనివారం 13 జూలై 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.10 (120.2518)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.43 (2.66)	12.38	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	98.58 (0.66)	నిల్	నిల్



గుడుంబా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహిస్తోన్న ఎక్సైజ్‌సిబ్బంది (ఫైల్)

గుడుంబాపై.. ఉక్కుపాదం

గుడుంబా, నకిలీ, నాన్‌డ్యూటీ మద్యం, గంజాయి నిరోధంపై ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. మద్యం విక్రయాల రాబడి క్రమబద్ధీకరించడంతోపాటు ప్రమాదకరంగా మారిన గంజాయి విక్రయాలను నిరోధించడం, గుడుంబా తయారీ లేకుండా చూడడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తున్నారు. గంజాయి రవాణా జరిగే జాతీయ రహదారులు, సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఉధృతంచేశారు. గుడుంబా తయారీ కేంద్రాలను గుర్తించి వాటిని ధ్వంసం చేసి, కేసులు నమోదు చేస్తున్నారు. మొత్తంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాను అక్రమ మద్యం, గుడుంబాలేని జిల్లాగా మార్చేందుకు ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- ఉధృతమైన దాడులు.. కేసులు నమోదు
- తయారీ, విక్రయాలున్న చోట అవగాహన కార్యక్రమాలు
- గంజాయి నిరోధానికి ప్రత్యేక చర్యలు
- మద్యం విక్రయాల్లో క్రమబద్ధీకరణకు కార్యాచరణ
- గుడుంబారహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏడాదికాలంగా మళ్లీ గుడుంబా తయారీ ఊపందుకొంది. గత ప్రభుత్వ హయాంలో గుడుంబా తయారీదారులను గుర్తించి వారికి పునరావాసం కింద ఇతర పనుల నిర్వహణకు రుణాలు, సబ్సిడీలు అందించింది. గుడుంబా తయారీని మాన్పించి, నిఘా ఉధృతంగా కొనసాగించడంతో దాదాపు 85శాతం వరకు గుడుంబా తయారీని అరికట్టగలిగారని అప్పట్లో అధికారులు ప్రకటించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల హడావిడి మొదలయినప్పటి నుంచి నిఘా తగ్గడం, పట్టింపులేకపోవడంతో మళ్లీ గుడుంబా తయారీ ఊపందుకొంది. ప్రధానంగా దేవరకొండ, హాలియా, మిర్యాలగూడ, నాంపల్లి ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలో గుడుంబా తయారీ, విక్రయాలు పెరిగాయి. ప్రధానంగా పేదవర్గాలు, కూలీలు, కార్మికులు తక్కువ ధరకు లభిస్తుండడంతో గుడుంబా తాగేందుకు మొగ్గుచూపుతున్నట్లు పేర్కొంటున్నారు. ఎన్నికల హడావిడి తగ్గాక ప్రభుత్వం ఎక్సైజ్‌శాఖపై దృష్టి పెట్టి గుడుంబా నిరోధానికి కఠినంగా వ్యవహరించాలని సూచించడంతో జిల్లాలో ఇందుకోసం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ విభాగాలతోపాటు, జనరల్ స్టాఫ్ ఉధృతంగా గుడుంబాతయారీ ప్రాంతాల్లో పర్యటిస్తూ, తయారీకేంద్రాలను గుర్తించి ధ్వంసం చేయడంతోపాటు తయారీదారులను అరెస్ట్‌చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 1,630 లీటర్ల గుడుంబాను సీజ్ చేయగా, 1,28,160 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడం దాడుల తీవ్రతను తెలియజేస్తోంది. అదేవిధంగా గుడుంబా తయారీలో కీలకంగా వాడే నల్లబెల్లం 111.33 క్వింటాళ్లు, 1,190 కిలోల ఆలం కూడా సీజ్‌చేశారు. అదేవిధంగా గుడుంబా తయారీ ఎక్కువగా ఉన్న దేవరకొండ, హాలియా, మిర్యాలగూడ ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో సారాయిపై సమరభేరి పేరుతో చైతన్య కార్యక్రమాలను చేపట్టారు. గుడుంబా మహమ్మారితో కుటుంబాలు గుల్లవుతాయనే సందేశాన్ని అందిస్తూ తయారీదారుల్లో, గుడుంబాసేవకుల్లో మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.




దేవరకొండ ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో సారాపై సమరభేరి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

ఆదాయ క్రమబద్ధీకరణకు చర్యలు

జిల్లాలో మద్యం దుకాణాల ద్వారా ప్రభుత్వం అనుమతించి మద్యం అమ్మకాలే సాగించడం ద్వారా ఆదాయం సమకూరేలా, ప్రతి అమ్మకమూ చట్టబద్ధమైనదే ఉండేలా చూడడం ద్వారా ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని వైన్స్‌దుకాణాలు, బార్‌ల ద్వారా విక్రయించే మద్యంలో నకిలీలు, నాన్‌డ్యూటీ మద్యం ఉండకుండా నిఘా పెంచారు. దుకాణాల్లో నిరంతర తనిఖీలను పెంచారు. టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలను బలోపేతం చేయడం ద్వారా మద్యం అమ్మకాల క్రమబద్ధీకరణ జరిగిందని, దీంతో ప్రతి అమ్మకమూ చట్టబద్ధంగా కొనసాగుతుందని తద్వారా ఆదాయం పెరుగుతుందని చెబుతున్నారు. జిల్లాలో ఏటా మద్యం విక్రయాల ఆదాయం పెరుగుతోందని, ఈ ఏడాది కూడా అదే ఒరవడి ఉంటుందని భావిస్తున్నారు. 2020-21లో రూ.1532.93కోట్ల విలువైన మద్యం విక్రయాలు సాగితే, 2021-22లో రూ.1433.64 కోట్ల విక్రయాలు, 2022-23లో రూ.1622.38కోట్ల విక్రయాలు సాగాయి. 2023-24లో రూ.1674.36 కోట్ల విక్రయాలు జరిగాయని, ఈ ఏడాది కూడా అదేస్థాయిలో విక్రయాలుంటాయని అంచనా వేస్తున్నారు.

గుడుంబా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం



గుడుంబా తయారీ, విక్రయాలను వందశాతం కట్టడి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. జిల్లాలోని దేవరకొండ, హాలియా, మిర్యాలగూడ, నాంపల్లి స్టేషన్ల పరిధిలో గుడుంబా ఎక్కువగా వస్తుండడంతో అక్కడ నిరోధానికి ప్రత్యేక చర్యలుచేపట్టాం. దాడులు, కేసులతోపాటు ప్రజల్లోనూ అవగాహన పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. యువత గుడుంబా, గంజాయివంటి మత్తు పదార్థాలకు అలవాటు కావద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. జిల్లాను వందశాతం గుడుంబా రహిత జిల్లాగా మార్చడమే ఏకైక లక్ష్యంగా పనిచేస్తున్నాం.

- బి.సంతోష్, జిల్లా ఎక్సైజ్, మద్యనిషేధశాఖ అధికారి, నల్లగొండ

గంజాయి, డ్రగ్స్ నిరోధంపై ప్రత్యేక కార్యాచరణ

జిల్లాలో ప్రధానంగా యువత ప్రధానంగా గంజాయి సేవనానికి అలవాడుపడి, విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్న ఘటనలు ఎక్కువ కావడంతో గంజాయి, డ్రగ్స్ నిరోధంపైనా ఎక్సైజ్‌శాఖ దృష్టిసారించింది. ప్రధానంగా ఏపీ నుంచి గంజాయి రవాణా జరిగే జాతీయ రహదారులపై పోలీసుల తో కలిసి దాడులు చేయడంతోపాటు గంజాయి విక్రయించేవారిపై కేసు లు నమోదు చేస్తున్నారు. ప్రధానంగా నల్లగొండ పట్టణ పరిధితోపాటు, మిర్యాలగూడ, దామరచర్లలో వలస కూలీలున్న దామరచర్ల ప్రాంతంలో గంజాయి విక్రయా లు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అక్కడ వీటి నిరోధానికి చర్యలు ఉధృతం చేసినట్లు వెల్లడిస్తున్నారు. వీటితోపాటు నాన్‌డ్యూటీ మద్యం విక్రయాలు, గోవా మద్యం రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. నల్లగొండ జిల్లాలో ఈ జనవరి నుంచి ఇప్పటి వరకు 624 కేసులు నమోదయితే ఇందులో గుడుంబా కేసులు 600 వరకు ఉండగా, మిగిలినవి గంజాయి, నాన్‌డ్యూటీ మద్యం విక్రయాలకు సం బంధించినవి. జిల్లాలో ఆరునెలల కాలంలో 269 మందిపై ఎక్సైజ్‌శాఖ కేసులు నమోదు చేయడం గమనార్హం. సూర్యాపేట జిల్లా లో నవంబరు నుంచి ఇప్పటి వరకు 1600 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసి, 123 కేసులు నమోదు చేసి, 62 మందిని అరెస్ట్ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.



అందరి సహకారంతోనే అభివృద్ధి

● ఆర్టీసీ నల్లగొండ రీజనల్ మేనేజర్ రాజశేఖర్



సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న రాజశేఖర్

మిర్యాలగూడ, జూలై 12: సిబ్బంది అకుంఠిత దీక్ష, సహాయ సహకారాలతో అంపశయ్యపై ఉన్న ఆర్టీసీ పురోగమనంవైపు పయనిస్తోందని నల్లగొండ రీజనల్ మేనేజర్ ఎం.రాజశేఖర్ అన్నారు. ఆర్ఎంగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారిగా మిర్యాలగూడ డిపోకు వచ్చిన ఆయన సిబ్బంది, ప్రయాణికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లక్ష్యాన్ని సాధించిన కండక్టర్, డ్రైవర్లకు ప్రోత్సాహక బహుమతులు, అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిపో మేనేజర్ బి.పాల్‌తో కలిసి మాట్లాడారు. రీజనల్ పరిధిలోని ఏడు డిపోలనుంచి రోజు రూ.1.50 కోట్ల ఆదాయం సమకూరుతోందన్నారు. 2.5లక్షల కిలోమీటర్ల ప్రయాణంలో ప్రతీ రోజు 3లక్షల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతున్నట్లు తెలిపారు. వారిలో 65 శాతం అంటే 2లక్షల వరకు మహాలక్ష్మి ప్రయాణికులు ఉన్నారన్నారు. రీజియన్‌లోని 644 బస్సుల్లో 240 అద్దె బస్సులున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు మిర్యాలగూడ డిపోలో మాత్రమే రాజధాని బస్సు నడుస్తోందని, ప్రస్తుతం నల్లగొండ డిపోకు కూడా రాజధాని బస్సు మంజూరైందని, దానిని హైదరాబాద్ టు నల్లగొండ మార్గంలో నడపడానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ప్రస్తుతం రీజియన్‌లో 65 మంది డ్రైవర్ల, 20 మంది కండక్టర్ల కొరత ఉందన్నారు. త్వరలోనే నూతన నియామకాల ద్వారా సిబ్బంది కొరత తీరుతుందన్నారు. మరో మూడు నెలల్లో ప్రయోగాత్మకంగా నడిపేందుకు నల్లగొండ, సూర్యాపేట డిపోలకు 50ఎలక్ట్రికల్ బస్సులు రానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ భారతీభాయి పాల్గొన్నారు.

75 నిమిషాల్లోనే హైదరాబాద్‌కు..

● నేటి నుంచి హైదరాబాద్‌కు 'రాజధాని'

నల్లగొండ, జూలై 12: ఇక నుంచి నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు 75 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. ఇందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసిన రాజధాని బస్సు ద్వారా సాధ్యమయ్యే అవకాశాలున్నాయి. వివరాల్లోకి వెళితే.. నల్లగొండ డిపో నుంచి హైదరాబాద్‌కు శనివారం రాజధాని(నాన్‌స్టాప్ ఏసీ) బస్సుతోపాటు, మరో మూడు డీలక్స్ బస్సులను ప్రారంభించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారు. ఉదయం 11గంటలకు జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు పెరుగుతున్న ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని మరో మూడు డీలక్స్ బస్సులను నడిపేందుకు కొనుగోలుచేశారు. రాజధాని నాన్‌స్టాప్ ఏసీ బస్సుచార్జి సుమారు రూ.260వరకు ఉండనున్నట్లు తెలిసింది. ప్రతీరోజు ఎన్ని ట్రిప్పులు నడుస్తుందనే దానిపై శనివారం నాడు అధికారులు టైం టేబుల్ ప్రకటించనున్నారు. రాజధాని ఏసీ బస్సు గంట నుంచి గంట 15 నిమిషాల్లో నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికులను చేరవేయనున్నట్లు సమాచారం.

చెరువులకు గండ్లు పడకుండా చూడాలి

● కలెక్టర్ సి.నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ, జూలై 12: వర్షాల కారణంగా చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా ముందే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా జిల్లాలో ఎక్కడైనా వర్షపు నీటికి తెగిపోయేందుకు గండ్లు పడేందుకు అవకాశం ఉన్న చెరువులను గుర్తించి వాటికి తగిన విధంగా మరమ్మతులు చేయాలన్నారు. ఒండ్రుమట్టి, మొరం, ఇసుక వంటివి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మట్టి విషయంలో ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు. ప్రభుత్వ భూములు, అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా కంచె వేయించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాజెక్టులకింద భూసేకరణకు సంబంధించి ప్రాధాన్యత ప్రకారం భూసేకరణ సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎ.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజు, డీఎఫ్‌వో రాజశేఖర్, ఎస్ఎల్‌బీసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు యథాతథం

● రిజిస్ట్రేషన్ శాఖలో తొలగిన సాంకేతిక సమస్యలు

నల్లగొండ, జూలై 12: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతోపాటు తహసీల్దార్ కార్యాలయాల్లో సాంకేతిక సమస్యలు తొలగడంతో రిజిస్ట్రేషన్‌లు యథావిధిగా కొనసాగాయి. గురువారం రిజిస్ట్రేషన్లకు తీవ్ర అంతరాయం కలిగిన విషయం తెలిసిందే. సర్వర్ డౌన్‌కావడంతో సబ్ రిజిస్ట్రార్‌లకు సంబంధించిన ఈ-కేవైసీ టెక్నికల్ సమస్య తలెత్తడంతో డాక్యుమెంట్లు నమోదుకాలేదు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఒకరోజు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో పెద్దఎత్తున డాక్యుమెంట్లు పెండింగ్‌లో పడిపోయాయి. నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో 1000కి పైగా డాకుమెంట్లు రిజిస్ట్రేషన్ కాలేదు. మరుసటి రోజు యథావిధిగా సర్వర్ పనిచేయడంతో సేవలు కొనసాగాయి. రిజిస్ట్రేషన్లకు ఆధార్, బయోమెట్రిక్ తప్పనిసరి కావడంతో ఆధార్ అనుసంధానంకాక సేవలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆ సమస్యలు తొలగిపోయాయని అధికారులు పేర్కొన్నారు. ఆధార్ సెంటర్ సర్వర్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యతో ఆధార్ ఆధారిత సేవలన్నింటికీ అంతరాయం కలిగింది. శుక్రవారం సాంకేతిక సమస్యలు తొలగడంతో పెండింగ్ డాక్యుమెంట్లతోపాటు కొత్తగా రిజిస్ట్రేషన్లకు చలాన్ కట్టిన వారికి కూడా రిజిస్ట్రేషన్లు అయ్యాయి.

సంప్రదాయ వస్త్రాలకు చిరునామా రామ్‌రాజ్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మాజీమంత్రి ఆర్డీఆర్

సూర్యాపేటటౌన్, జూలై 12: భారతీయ సంప్రదాయ వస్త్రాలకు చిరునామాగా రామ్‌రాజ్ కాటన్ నిలిచిందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూంను ప్రారంభించి, మాట్లాడారు. రామ్‌రాజ్ కాటన్ వస్త్రాల కోసం జిల్లా ప్రజలు హైదరాబాద్ వంటి మహానగరాలకు వెళ్లే పరిస్థితి ఉండేదని, నూతన షోరూం ఏర్పాటుతో ప్రజలకు అందుబాటులోకి రామ్‌రాజ్ కాటన్ వస్త్రాలు వచ్చాయన్నారు. దేశవ్యాప్తంగా 300కి పైగా రామ్‌రాజ్‌కాటన్ షోరూంలు ఏర్పాటుచేసిన వ్యవస్థాపకుడు, చైర్మన్ కేఆర్ నాగరాజన్ ప్రజల నమ్మకాన్ని, మన్ననలకు పొందారని తెలిపారు. సుమారు 30 వేల మంది ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తున్న రామ్‌రాజ్‌కాటన్ షోరూం మరింతగా విస్తరించాలన్నారు. అందుబాటు ధరలో నాణ్యమైన వస్త్రాలను అందించేలా రామ్‌రాజ్‌కాటన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో షోరూం సిబ్బంది రాకేష్, కన్నన్, మహేష్, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, నాయకులు కొప్పుల వేణారెడ్డి, కౌన్సిలర్లు కక్కిరేణి శ్రీనివాస్, వేములకొండ పద్మ, కొండపల్లి నిఖిలదిలీప్‌రెడ్డి, ఎలిమినేటి అభినయ్, జహీర్, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, ధరావత్ వీరన్ననాయక్, చకిలం రాజేశ్వర్‌రావు, బాలుగౌడ్, కరుణాకర్‌రెడ్డి, నాగుల వాసు, యేల్లే వెంకన్న, యెల్లే అనసూర్య పాల్గొన్నారు.

కాసులిస్తేనే కాల్వనీరు !

● మూసీ కాల్వ కాపలదారు తీరు ● అమ్మనబోలు రైతుల ఆరోపణలు ● బీళ్లుగా మారుతున్న పొలాలు ● కాల్వ పరిధిలో 3 వేల ఎకరాల ఆయకట్టు





నీరందక బీళ్లు బారుతున్న రైతు సతీశ్ వరి పొలం

అసలే వాన జాడలేదు. ఆపై మూసీ వాగు నీరు రాదు. వెరసి వ్యవసాయమే జీవనాధారమైన అక్కడి అన్నదాతల పరిస్థితి రోజు రోజుకూ అగమ్యగోచరంగా తయారవుతోంది. కనీసం కాల్వ ద్వారా సాగునీటిని సైతం దేహీ అనాల్సిన పరిస్థితులేర్పడుతున్నవైనం దురదృష్టకరం. వర్షాలు కురవక మూసీ రాచకాల్వ నీటిపై ఆధారపడి సాగు చేసిన పంట పొలాలకు నీరందాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనంటూ కాల్వ కాపలాదారు డిమాండ్ చేస్తున్న తీరుపై రైతులు కన్నెర్ర జేస్తున్నారు. నీళ్లు విడువక, సకాలంలో నీరందక, వేసిన వరి నారు, పైరు ఎండి పొలాలు బీళ్లు వారుతున్నాయని నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు మూసీ కాల్వ పరిధిలోని రైతులు ఆరోపిస్తున్నారు.

● నార్కట్‌పల్లి

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని పల్లివాడ నుంచి (శాలిగౌరారం ఆసిఫ్‌నెహర్ ఫీడర్ ఛానల్) రాచకాల్వ ద్వారా అమ్మనబోలుకు మూసీనీరు అందాల్సి ఉంది. ఈకాల్వ పరిధిలో సుమారు 3వేల ఎకరాల ఆయకట్టు ఉంది. సాగుచేస్తున్న రైతులు సుమారు 600మందికి పైగానే ఉన్నారు. డబ్బులిస్తేనే కాల్వకు తూము ద్వారా నీరిస్తానని కాల్వ కాపలాదారు డిమాండ్ చేసి నీరు వదలకపోవడంతో కొందరి రైతుల పంట పొలాల్లో నారు ఎండిపోయింది. అటు వానలు కురవక, ఇటు కాల్వ నీరు అందక వందల ఎకరాల్లో చేసిన వరిసాగు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట కోసం పెట్టిన పెట్టుబడి కూడా రాక నష్టపోతామని తమ గోడు వినేదెవ్వరని వాపోతున్నారు. ఇదిలా ఉంటే రైతులు చేస్తున్న ఆరోపణలపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా సంబంధిత అధికారులెవరూ అందుబాటులో లేరు.

వందలాది ఎకరాలకు నీరందాలి



రాచకాలువపై పల్లివాడ వద్ద ఉన్న దర్వాజ నుంచే మూసీ నీరు కాల్వ ద్వారా అమ్మనబోలుకు చేరుతుంది. దీంతో జాలకుంట, దామెర చెరువులు నిండి వందలాది ఎకరాలకు సాగు నీరందాల్సి ఉంది. కానీ కాల్వపై పనిచేసే ప్రభుత్వ ఉద్యోగి పదవీ విరమణ కావడంతో ఆవుల లింగస్వామి అనే ప్రైవేటు వ్యక్తిని నియమించారు. అతను ఏ మాత్రం బెరుకులేకుండా కాల్వకు నీరు వదలాలంటే రూ.30,000లు డిమాండ్ చేస్తున్నాడు. నాకున్న 7 ఎకరాలతో పాటు మరో 23 ఎకరాలు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాను. ఇందుకు గాను ఇప్పటికే రూ.5లక్షలకు పైగా ఖర్చు చేశాను. నీరందక పంటలు ఎండిపోతున్నాయి. కాల్వ నిర్వహణలో కూడా నిర్లక్ష్యం ఉంది. గుర్రపు డెక్క ఏపుగా పెరిగినా తొలగించాలన్న ధ్యాసే నీటి పారుదల శాఖ అధికారులకు లేదు.

పజ్జూరి ఇంద్రారెడ్డి, రైతు అమ్మనబోలు,

నీరందక ఎండిన వరిపైరు



వరి నాటు వేసి వానలు కోసం ఎదురుచూస్తున్నాం. కానీ చుక్క వర్షం కూడా పడటం లేదు. కనీసం రాచకాలువ ద్వారా మూసీ నీరైనా అందుతుందనుకుంటే అదీ అందించే స్థితిలో అధికార యంత్రాంగం లేదు. నెర్రెలు బారుతున్న పొలాలను చూసి ఏం చేయాలో తోచడం లేదు. కాల్వ నీరు వదలమని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిందే. కాల్వకు ఉన్న తూములను కూడా సరిగ్గా నిర్వహించడం లేదు. దీంతో అవి బురద, చెత్తా చెదారంతో నిండి పూడిపోతున్నాయి.

కన్నెబోయిన సతీశ్, రైతు అమ్మనబోలు

ప్రాజెక్టులను పూర్తి చేసి సాగునీరందించాలి

సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



సీపీఐ సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

దేవరకొండ, జూలై 12: శ్రీశైలం సొరంగమార్గం, డిండి, నక్కలగండి ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లా రైతులకు సాగునీరందించాలని సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ సీపీఐ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టులకు నిధులు కేటాయించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విభజన హామీలు అమలుచేసి తెలుగు రాష్ట్రాల సమస్యలు పరిష్కరించాలన్నారు. దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిని 200 పడకల ఆస్పత్రిగాచేసి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలపై సీపీఐ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. సీపీఐ సీనియర్‌నేత శైలేజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, రమావత్ అంజయ్య నాయక్, పల్లా దేవేందర్‌రెడ్డి, వెంకటరమణ, పల్లె నర్సింహ, బుచ్చిరెడ్డి, వెంకటయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బాబురావు, అంజనేయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

చిట్యాల, జూలై 12: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనీఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. రోగులతో మాట్లాడి ఆరోగ్యకేంద్రంలో అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఆరోగ్యకేంద్రంలోని సిబ్బంది, హాజరు రిజిస్టర్, మందుల స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. ఆస్పత్రిలోని సిబ్బంది గురించి ఆరా తీశారు. రేబిస్ వ్యాక్సిన్, చిన్నపిల్లల వ్యాక్సిన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వీరేందర్, వైద్యాధికారులు డాక్టర్ సయ్యద్ అజహర్ మహ్మద్, సత్యనరేష్, సిబ్బంది శ్రీనివాస్, చక్రవర్తి పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల ఉపాధిని

దెబ్బతీయవద్దు

సుశృత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు హనుమంతరావు



సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు

నల్లగొండ, జూలై 12: గ్రామీణ వైద్యుల క్లినిక్‌లపై ఐఎంఏ, నేషనల్ కౌన్సిల్ సభ్యులతో దాడులు నిర్వహిస్తూ గ్రామీణ వైద్యుల ఉపాధిని దెబ్బతీయవద్దని సుశృత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.హనుమంతరావు అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించాలని, తమపై దాడులు నివారించాలని కోరుతూ ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేయగా వారు సానుకూలంగా స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ వైద్యులంతా ప్రభుత్వం ఇచ్చిన శిక్షణ పూర్తి చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. తమను చిన్నచూపు చూసే విధంగా వ్యవహరించడం మానుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి జినర్సింహారెడ్డి, బ్రహ్మచారి, డీఎస్ఎన్‌చారి, ఎండీ నజీరొద్దిన్, వెంకటేశ్వర్లు, మదునాచారి, లలితా, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ



అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూలై 12: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నృసింహస్వామి వారి సన్నిధిలో స్వర్ణపుష్పార్చన, ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ఆగమశాస్త్ర రీతిలో వేదకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలతో, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, వజ్రవైఢూర్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో ఊయలలో అధిష్టింపజేశారు. అర్చకుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులచే మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు ఆగమశాస్త్రరీతిలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా చేపట్టారు. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని శ్రీ రామలింగేశ్వరస్వామి వారికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమపద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.28,20,554 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, నటరాజ ఆర్ట్స్ అకాడమీకి చెందిన విజయ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది. స్వామివారిని దర్శించుకునేందుకు యాదగిరిగుట్టకు వచ్చిన హైదరాబాద్‌కు చెందిన జయకస్తూరికి సంబంధించి ఐఫోన్ అపహరణకు గురికాగా ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్పీఎఫ్ సిబ్బంది రామకృష్ణ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను పరిశీలించి దొంగిలించిన వ్యక్తిని పట్టుకుని, స్థానిక పోలీసులకు అపహరించిన ఐఫోన్‌ను బాధితురాలికి అప్పగించారు.

రహదారిపై లారీ బోల్తా

చింతపల్లి, జూలై 12 : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మేడు గ్రామ శివారు నాగార్జునసాగర్ -హైదరాబాద్ రాష్ట్ర రహదారిపై శుక్రవారం లారీ బోల్తాపడింది. జగ్గయ్యపేట నుంచి వస్తున్న సిమెంట్ రేకుల లారీ మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్లకు ఎలాంటి గాయాలుకాలేదు.



కుర్మేడు గ్రామ శివారులో బోల్తాపడిన లారీ

ఇసుక కోసం పాలేరు వాగు గుల్ల

● నాయకుల కనుసన్నల్లోనే ఇసుక అక్రమ తవ్వకాలు
● ట్రాక్టర్‌కి రూ.5 వేల వరకు వసూలు
● పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు



ఉర్లుగొండ-నర్సింహాపురం గ్రామాల పరిధిలోని పాలేరు వాగులో ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

మోతె, జూలై 12 : వర్షాభావ పరిస్థితుల్లో ఎండిపోయిన పాలేరు వాగును ఇసుక అక్రమదారులు ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. యేరులో ఏళ్లుగా పేరుకున్న ఇసుక అధికార పార్టీ నాయకులకు కల్పతరువుగా మారింది. రెండు నెలలుగా ఏరుకు ఆనుకుని ఉన్న గ్రామాలకు చెందిన మహిళా నాయకురాలు, మరో మాజీ ప్రజాప్రతినిధి కలిసి మండల నాయకులకు ట్రాక్టర్‌కు రూ.5 వేల చొప్పున ముట్టజెప్పి ఇసుక అక్రమ రవాణాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు అటుగా వెళ్లకుండా నాయకులు చూసుకుంటున్నట్లు సమాచారం.

సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా మోతె మండలంలోని పాలేరు వాగు విస్తరించి ఉన్నది. ఖమ్మం జిల్లాలోని జలాశయానికి ఆనుకుని ఉన్న వరకు నీరులేకపోవడంతో ఇసుక తోడిన కొద్దీ ఇసుక లభిస్తోంది. దీంతో ప్రతి రోజూ సుమారు 100 ట్రాక్టర్లకు పైబడే ఇసుకను తరలిస్తున్నారు. మోతె మండలంలోని నర్సింహాపురం, ఉర్లుగొండ, తుమ్మగూడెం, నేరేడువాయి, రంగాపురంతండా, రాయికుంటతండా, అన్నారిగూడెం, గోపతండ గ్రామాల పరిధిలో వాగు సుమారు మూడు కిలోమీటర్ల విస్తరించి ఉంది. ఇందులో నుంచి ఈ గ్రామాలకు చెందిన వారు నిత్యం అక్రమంగా వాగులో పెద్ద గోతులు తీసి ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ట్రాక్టర్లు ఉన్న ప్రతి ఒక్కరు ఊ అధికార పార్టీ నాయకుల వద్ద నెలవారీ చెల్లింపులు చెల్లించిన తర్వాతనే ఇసుకను తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అడ్డుకునే ప్రయత్నాలు అధికారుల్లో కనిపించడం లేదు.

100 ట్రాక్టర్ల పైబడే..

రెండు నెలల నుంచి నిత్యం వాగు నుంచి 100 ట్రాక్టర్ల పైబడే ఇసుకను తరలిస్తున్నారు. మొదట్లో అధికార పార్టీ నాయకులకు చెందిన వారు మాత్రమే తరలించగా మెల్లగా ఏరుకు ఆనుకుని ఉన్న నాయకుల అండతో మిగతా ట్రాక్టర్ల వారు తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నర్సింహాపురం గ్రామస్థులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో వారిపై దాడులకు దిగారు. వారి వివరాలు ట్రాక్టర్ల వారికి, పైరవీకారులకు అందజేయడంతో వారు దుర్భాషలకు దిగుతున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వ్యాపారులు బ్రిడ్జికి ఆనుకుని వెళ్తుండటంతో రాళ్ల తేలి పిల్లర్లు కుంగే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు బేఖాతరు

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లకు నెంబరు ప్లేట్స్, కాగితాలు ఉండవు. మైనర్లు ట్రాక్టర్లను నిర్వహిస్తున్నారు. యేరుకు ఆనుకుని ఉన్న రైతుల భూముల్లో నుంచి వందల ట్రాక్టర్లు వెళ్తుండటంతో పొలాలు ధ్వంసమవుతున్నాయి. వాగులో వేసిన విద్యుత్ మోటార్ల పైపులు, విద్యుత్ తీగలు, మోటార్లు పగిలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఉర్లుగొండ గ్రామానికి చెందిన వ్యక్తి తుమ్మలపల్లిలో ఇసుకను తరలిస్తూ అతివేగంతో ఢీకొట్టడంతో గ్రామానికి చెందిన మంద ఉపేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది జరిగి రోజులు గడవక ముందే ఇష్టానుసారంగా ట్రాక్టర్లల్లో టేప్ రికార్డులను పెట్టుకుని అతివేగంతో ట్రాక్టర్లను నడుపుతున్నారు. దీంతో వెనకాల వస్తున్న వారికి ఇబ్బంది కలుగుతోంది. పర్యవేక్షణ చేయాల్సిన పోలీసులు, వాహన తనిఖీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

10 శాతం కేసులు కూడా నమోదు లేదు

రెండు నెలల పైబడి వాగు నుంచి ఇష్టానుసారం ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నా పట్టుమని 10 శాతం కేసులైనా నమోదుకాలేదు. వాగులో రెండు కిలోమీటర్ల మేర ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తు జాతరను తలపిస్తున్నా రెవెన్యూ, పోలీసులు, మైనింగ్, శాఖల అధికారులకు కనిపించవని రైతులు వాపోతున్నారు. ప్రతి రోజూ వాగు నుంచి రూ.లక్షల విలువైన విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. ఖమ్మం, నేలకొండపల్లి, కోదాడకు ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. రెండు నెలల్లో ఒక్క ట్రాక్టర్ ఇసుకైనా పట్టుబడి మైనింగ్‌కు అప్పజెప్పిన సంఘటనలు లేవు.

వేగంగా వెళ్తున్న ట్రాక్టర్లతో ఇబ్బందులు

వాగులో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు ఇష్టానుసారం వెళ్లడంతో వాగుకు ఆనుకుని ఉన్న బోర్లు, విద్యుత్ మోటార్ల తీగలు, పైపులు పగిలిపోతున్నవి. ఇదేంటని ప్రశ్నిస్తే దాడులకు దిగు తున్నారు. అతివేగంతో నడపడంతో వాగులో నుంచి పొలాలకు వేసుకున్న పైపులు పగిలిపోతున్నాయి.ఇసుకను అక్రమంగా తరలించడమే కాకు ఒడా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

● రాంరెడ్డి, రైతు

ఇసుకను తరలిస్తే చర్యలు

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేసి కట్టడికి చర్యలు చేపడతాం. ఎంతటివారైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు.

వేణుమాధవ్, ఆర్డీవో

దాడి చేస్తూ.. సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ...

● సూర్యాపేట పేటలో యువకుల వీరంగం



ఆదివంశీ అనే యువకుడిపై దాడిచేస్తున్న యువకులు

సూర్యాపేటక్రైం, జూలై 12 : సూర్యాపేట పట్టణంలో కొందరు యువకులు వీరంగం సృష్టించారు. ఈ నెల 10వ తేదీ రాత్రి సమయంలో సూర్యాపేటలోని నిర్మల ఆసుపత్రి సమీపంలో ఓ యువకుడిని ఐదుగురు యువకులు కలిసి చితకబాదారు. ఇటీవల తమ మిత్రుడిపై దాడికి పాల్పడ్డాడని ప్రతి దాడికి దిగారు. సూర్యాపేటలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఓ యువకుడిపై ఇటీవల చంద్రన్నకుంటకు చెందిన ఆదివంశీ అనే యువకుడితో పాటు మరికొందరు కలిసి దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని దాడిలో గాయపడిన యువకుడు రాజీవ్‌నగర్‌కు చెందిన తన మిత్రులకు తెలిపాడు. దీంతో వారంతా ప్రతిదాడి చేసేందుకు వెతకసాగారు. అయితే దాడికి పాల్పడ్డ వారిలో ఒకరైన ఆదివంశీ ఈ నెల 10వ తేదీన రాత్రి సమయంలో నిర్మల ఆసుపత్రి సమీపంలో ఉన్నాడనే విషయాన్ని తెలుసుకున్నారు. ఐదుగురు యువకులు బైక్‌లపై అక్కడికి చేరుకుని ఆదివంశీపై విచక్షణరహితంగా దాడి చేశారు. సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తూ మరీ దాడి చేశారు. గమనించిన స్థానికులు దాడి చేయవద్దని వారించినా యువకులు లెక్క చేయలేదు. రాళ్లు, ఇటుకలు, కర్రలు తీసుకుని దాడి చేశారు. అనంతరం దాడిలో గాయపడిన యువకుడిని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. అనంతరం స్థానికుల సాయంతో దాడిలో గాయపడిన యువకుడు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం స్థానికంగా సోషల్‌మీడియాలో వీడియోలు వైరల్ కావటంతో విషయం వెలుగుచూసింది.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

సూర్యాపేటలో ఈ నెల 10వ తేదీ రాత్రి కొందరు యువకులు ఓ యువకుడిపై దాడికి పాల్పడిన సంఘటనా స్థలాన్ని సూర్యాపేట డీఎస్పీ జీ రవి శుక్రవారం పరిశీలించారు. ఘటనా స్థలంలో దాడి జరిగినపుడు అక్కడ ఉన్న స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ రవి మాట్లాడుతూ పట్టణంలో కొందరు యువకులు కక్షతో ఒక యువకుడిపై దాడికి పాల్పడిన విషయమై కేసు నమోదు చేశామన్నారు. దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తామన్నారు. పట్టణంలో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. మత్తులో ఇతరులపై దాడులకు పాల్పడితే సహించేది లేదన్నారు.

యువతి ఆత్మహత్య కేసులో ఇద్దరి అరెస్ట్



మిర్యాలగూడలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, జూలై 12 : ప్రేమ పేరుతో వేధించి యువతి ఆత్మహత్యకు కారణమైన ఇద్దరిని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు వివరాలు వెల్లడించారు. మాడ్గులపల్లి మండలం కుక్కడం ఆవాసం చింతగూడెం గ్రామానికి చెందిన కొత్త కల్యాణి(18)ని అదే గ్రామానికి చెందిన ఆరూరి శివ, కొమ్మనబోయిన మధు ప్రేమించమని, పెళ్లి చేసుకోవాలని వేధించారు. లేదంటే తమతో దిగిన ఫోటోలను వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ గ్రూపుల్లో డీపీలుగా పెడతామని, కాల్ రికార్డులు బయట పెడతామని బెదిరించారు. వారి వేధింపులు భరించలేక ఈ నెల 6వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో కల్యాణి క్రిమిసంహారక మందు తాగింది. ఇంటి చుట్టుపక్కల వారు గమనించి చికిత్స నిమిత్తం ఆమెను మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తీసుకుని వచ్చారు. మెరుగైన చికిత్సకోసం నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 9వ తేదీ మృతి చెందింది. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ వీరబాబు పర్యవేక్షణలో మాడ్గులపల్లి ఎస్ఐ జీ శోభన్‌బాబు, సిబ్బంది పరారీలో ఉన్న నిందితుల్లో ఒకరైన శివను చింతలగూడెం గ్రామంలో, మధును మాడ్గులపల్లి టోల్‌ప్లాజా వద్ద అరెస్ట్ చేసి వారిద్దరి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

రసాయన పరిశ్రమలో గ్యాస్ లీక్‌తో ఏడుగురికి అస్వస్థత

చౌటుప్పల్ రూరల్, జూలై 12: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శివారులోని రసాయన పరిశ్రమలో గ్యాస్ లీకై ఏడుగురు కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం శ్రీ జయల్యాబ్ పరిశ్రమలో గురువారం మధ్యాహ్నం 12గంటలకు రియాక్టర్ వద్ద ప్రమాదవశాత్తు వాయువు లీకైంది. ఈ ఘటనతో రియాక్టర్ వద్ద పనిచేస్తున్న ఏడుగురు కార్మికులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన నేలపట్ల నాగబాబు(23), లలిత్‌పెట్టి (25), తూర్పుగోదావరి జిల్లా గూడజాలానికి చెందిన జె.చిన్నబాబు (21), ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పొత్తూరుకు చెందిన ఎల్లమల్ల శ్రీనివాస్‌రావు (41), యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని జనగాం గ్రామానికి చెందిన కొండూరు గిరిబాబు (30), హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌కు చెందిన పోతూరి కృష్ణంరాజు, చౌటుప్పల్ మండలానికి చెందిన నర్ర గోపిలు వాయువు పీల్చి స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించారు. ఇందులో ముగ్గురు కార్మికులకు ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందిగా ఉండటంతో ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. మిగతావారికి సాధారణ వార్డులో చికిత్స అందిస్తున్నారు. అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని సీఐ తెలిపారు. నాగబాబు భార్య గౌతమి స్థానిక పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఆర్ఆర్‌యూ చోరీలో కీలక నిందితుడి అరెస్టు

నల్లగొండ క్రైం, జూలై 12 : కొంతకాలంగా ఎయిర్‌టెల్ టవర్ రేడియో రిమోట్ యూనిట్(ఆర్ఆర్‌యూ)లను చోరీ చేస్తున్న కీలక నిందితుడు ధీరావత్ నగేష్‌ను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఈ కేసుకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు కీలక నిందితుడు మిర్యాలగూడ మండలం ధీరావత్ తండాకు చెందిన నగేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలను నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. ధీరావత్ నగేష్‌ను నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ అంతిరెడ్డి, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరితో పాటు స్థానిక సిబ్బంది నార్కట్‌పల్లి వద్ద అరెస్టు చేశారన్నారు. ధీరావత్ తండాకు చెందిన ఐదుగురు కలిసి ముఠాగా ఏర్పడి ఎయిర్‌టెల్ టవర్‌లోని ఆర్ఆర్‌యూలను చోరీ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన మున్నా అనే వ్యక్తికి తక్కువ ధరలకు విక్రయిస్తూ వస్తున్నారని, ఈ ముఠాలో నగేష్ కీలక వ్యక్తి అని వివరించారు. నగేష్‌పై మొత్తం 17చోరీ కేసులు ఉన్నాయని, గతంలోనే 8 కేసుల్లో జైలుకెళ్లి బెయిల్‌పై వచ్చాడన్నారు. ఇతడిపై ఏపీలోని అనంతపురం జిల్లా రాయపర్తిలో కూడా కేసు నమోదైందని, ఏపీలోని గుంటూరు, మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్, నల్లగొండ, సూర్యాపేట, రాచకొండ కమిషనరేట్ పరిధిలో కూడా చోరీ కేసులు నమోదయ్యాయని వివరించారు.ఇప్పటికే నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఆర్ఆర్‌యూల రిసీవర్ హైదరాబాద్‌కు చెందిన మున్నా పరారీలో ఉన్నట్లు డీఎస్పీ వివరించారు.

సూర్యాపేట జిల్లాలో పలువురు ఉపాధ్యాయులకు

షోకాజ్‌నోటీసులు జారీ

సూర్యాపేట(కలెక్టరేట్), జూలై 12 : సూర్యాపేట జిల్లాలో పలువురు ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని గరిడేపల్లి, పెన్‌పహాడ్ మండలాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో అశోక్‌కుమార్ మునగాల, కోదాడ, మఠంపల్లి, అర్వపల్లి, చిలుకూరు మండలాల్లో పలు పాఠశాలలను సందర్శించారు. కాగా ఉన్నతఅధికారుల అనుమతి లేకుండా పాఠశాల విధులకు గైర్హాజరైన మునగాల మండలం ఆకుపాముల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం షేక్ దస్తగిరి, చిలుకూరు మండలం ఆచార్యులగూడెం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కే రాంరెడ్డి, కోదాడ మండలం కొమరబండ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం పీ గోవిందయ్య, మఠంపల్లి మండలం అల్లిపురం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శేషిరెడ్డి, మద్దిరాల మండలం కుక్కడం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కే కృష్ణారెడ్డి, పెన్‌పహాడ్ మండలం సింగిరెడ్డిపాలెం మండల ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం బీ నరేందర్, అదేపాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్, అర్వపల్లి మండలం ఉయ్యాలవాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అపరాజిత రెడ్డిలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

బ్యాటరీలు చోరీ చేస్తున్న ముఠా సభ్యుల అరెస్టు



బ్యాటరీలను ప్రదర్శిస్తూ చోరీ చేసిన ముఠా వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

నల్లగొండ క్రైం, జూలై 12 : కుటుంబ సభ్యులతో కలిసి ముఠాగా ఏర్పడి ప్రభుత్వ పాఠశాల్లో డిజిటల్ క్లాసుల కోసం ఏర్పాటు చేసిన బ్యాటరీలను చోరీచేస్తున్న ముఠాలను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి రూ.7.18 లక్షల విలువైన 100 బ్యాటరీలు, ట్రాలీ ఆటో, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ కొలను శివరాం రెడ్డి పూర్తి వివరాలను వెల్లడించారు.

నకిరేకల్‌కు చెందిన పలువురు ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన విలువైన బ్యాటరీలను చోరీ చేసేందుకు రెండు ముఠాలుగా ఏర్పడ్డారు. నకిరేకల్ పట్టణంలోని టీచర్స్‌కాలనీకి చెందిన గోపాగాని జగన్, ఆవుల తిమ్మయ్యతో పాటు మరో 10 మంది ఒక ముఠాగా, అదే ప్రాంతానికి చెందిన ఆవుల సంజీవ, నాగిళ్ల నాగరాజుతో పాటు మరో నలుగురు కలిసి మరో ముఠాగా ఏర్పడి వేర్వేరుగా బ్యాటరీలను చోరీ చేస్తున్నారు. కొంతకాలంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో బ్యాటరీలు చోరీకి గురవుతుండగా విద్యాశాఖ అధికారుల ఫిర్యాదుమేరకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేక దృష్టి సారించి ఆయన ఆదేశాల మేరకు నేర విభాగంలో పనిచేస్తున్న పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో నల్లగొండ సీసీఎస్, శాలిగౌరారం పోలీసులు సంయుక్తంగా కలిసి నకిరేకల్ నుంచి శాలిగౌరారం మీదుగా బ్యాటరీల లోడుతో హైదరాబాద్‌కు వెళ్తున్న ట్రాలీ ఆటోను శాలిగౌరారం ఎక్స్‌రోడ్డు వద్ద ఆపి తనిఖీ చేశారన్నారు. ఆటోలో ఉన్న డ్రైవర్ గోపాగాని జగన్‌తో పాటు మరో వ్యక్తి ఆవుల తిమ్మయ్యని అదుపులోకి తీసుకుని విచారించగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బ్యాటరీలను చోరీ చేసినట్లు అంగీకరించారన్నారు. ముఠాకు చెందిన మరో 10 మంది పరారీలో ఉండగా అందులో ఆరుగురు మహిళలు ఉన్నారని తెలిపారు. అదేవిధంగా వీరిచ్చిన సమాచారం మేరకు మరో ముఠాకు చెందిన ఆవుల సంజీవ, నాగిళ్ల నాగరాజును కూడా నకిరేకల్‌లో అరెస్టు చేశామన్నారు. ఈ ముఠాకు చెందిన నలుగురు మహిళ నేరస్థులు పరారీలో ఉన్నట్లు వివరించారు.

గతంలోనూ నేరాలు

రెండు ముఠాలుగా ఏర్పడి బ్యాటరీల చోరీలకు పాల్పడుతున్న నిందితులు గతంలో నల్లగొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో చోరీలు చేసి జైలుకు వెళ్లి వచ్చారన్నారు. గతంలో వీరంతా జైలుకు వెళ్లినా వారిలో పరివర్తన రాకపోగా తిరిగి కుటుంబసభ్యులతో సహా చోరీచేయాలని నిర్ణయించుకుని అనుకున్న ప్రకారం రెండు ముఠాలుగా విడిపోయి చోరీలకు పాల్పడుతున్నారని వివరించారు.

17 ప్రభుత్వ స్కూళ్లలో బ్యాటరీలు చోరీ

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఈ రెండు ముఠాలు చోరీలకు పాల్పడినట్లు డీఎస్పీ తెలిపారు. నల్లగొండ జిల్లాలోని కట్టంగూరు, శాలిగౌరారం, కేతేపల్లి, నకిరేకల్, తిప్పర్తి, మాడ్గులపల్లి, సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట రూరల్, చివ్వెంల, ఆత్మకూర్(ఎస్), అర్వపల్లి మండలాల్లోని 17 ప్రభుత్వ పాఠశాల్లో బ్యాటరీలను చోరీ చేశారన్నారు. ముఠా సభ్యులను పట్టుకోవడంలో కృషి చేసిన సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, శాలిగౌరారం సీఐ కొమిరెడ్డి కొండల్‌రెడ్డి, ఎస్ఐలు డీ సైదులు, గోపికృష్ణ, అయిలయ్య, సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ విష్ణువర్ధనగిరి, సిబ్బంది లింగారెడ్డి, శ్రీధర్‌రెడ్డితో పాటు పలువురిని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

పోలీసుల అదుపులో పార్థీ గ్యాంగ్ ముఠా సభ్యుడు?

● ఇప్పటికే రిమాండ్‌లో ఇద్దరు

నల్లగొండ క్రైం, జూలై 12 : కరుడుగట్టిన అంతర్రాష్ట్ర పార్థీ గ్యాంగ్‌కు చెందిన ముఠా సభ్యుడిని నల్లగొండ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నెల 6వ తేదీన నల్లగొండ జిల్లా పోలీసులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా హైదరాబాద్ సమీపంలోని అవుటర్ రింగ్ రోడ్డు వద్ద గ్యాంగ్‌కు చెందిన మహారాష్ట్రలోని పూణె జిల్లా ఇందాపూర్‌కు చెందిన కీలక నిందితులైన అప్ప పాండ్రంగా, అహ్మద్ నగర్ జిల్లా దుదువాడికి చెందిన శుభం అశోక్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ముఠాకు చెందిన మరో ఇద్దరు మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా పండరీపూర్‌కు చెందిన కాశ్మీర్ శశిపాల్ భోంస్లే, పూన జిల్లా ఇందాపూర్‌కు చెందిన అదేష్ అనిల్ ఖలే పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఇద్దరి కోసం పోలీసులు ముమ్మరంగా వేట ప్రారంభించి పరారీలో ఉన్న నిందితుల్లో కాకుండా ముఠా సభ్యుడైన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మహారాష్ట్రకు చెందిన గ్యాంగ్ సభ్యుడైన అనిల్‌కపూర్‌ను జిల్లా పోలీసులు మహారాష్ట్రకు వెళ్లి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ముఠాను అరెస్టు చేసేందుకు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలు, సూచనల మేరకు పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న గ్యాంగ్ సభ్యుడు గ్యాంగ్ లీడర్ అప్ప పాండ్రంగా పిలిచిన సమయంలో వచ్చి అతడు చెప్పినట్లు చేసినందుకు అనిల్‌కపూర్‌కు రోజూ కూలీగా చెల్లించే వాడని సమాచారం. ఈ గ్యాంగ్ ఎక్కడెక్కడ చోరీలు, నేరాలు చేశారనే కోణంలో పోలీసులు అనిల్‌కపూర్‌ను విచారిస్తున్నట్లు తెలిసింది. గ్యాంగ్ నేరాలు చేసిన ప్రాంతాలకు తీసుకెళ్లి ఏవిధంగా నేరాలు చేశారు, ఎక్కడెక్కడ ఏం చేశారనే కోణంలో పోలీసులు చేస్తున్న దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

సూర్యాపేట క్రైం, జూలై 12 : అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుసుమవారిగూడెం శివారు వద్ద జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కల్వలపాలెం గ్రామానికి చెందిన తిరుగుడు వెంకన్న(48) తన ట్రాక్టర్‌పై పనినిమిత్తం సూర్యాపేటకు వస్తున్నాడు. అయితే సూర్యాపేట పట్టణ శివారు కుసుమవారిగూడెం వచ్చేసరికి రోడ్డుపై ఏర్పడిన గుంతను గమనించకపోవడంతో ఆ గుంతలో పడి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ వెంకన్నపై పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు వెంకన్న కుమారుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ ఢీ కొట్టడంతో వృద్ధుడి..

ఆత్మకూర్(ఎస్), జూలై 12 : యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన పిడమర్తి యల్లయ్య(68)ను బైక్ ఢీకొనడంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయన కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యల్లయ్య తన ఇంటి నుంచి గేదెలను తీసుకుని వెళ్తుండగా గుర్తుతెలియని బైక్ వేగంగా వచ్చి ఆయన్ను బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన యల్లయ్య అక్కడికక్కడ మృతి చెందాడు. బైక్‌పై ఇద్దరూ వ్యక్తులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఢీ కొట్టిన బైక్ ఆపకుండా వేగంగా వెళ్లినట్లు తెలిపారు. యల్లయ్య కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. యల్లయ్యకు భార్య , కుమార్తె, కుమారుడు ఉన్నారు. యల్లయ్య మృతికి సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ, పీవైఎల్ సంఘాల నాయకులు సంతాపం తెలిపి, నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ పెయింటర్..

భువనగిరిటౌన్, జూలై 12 : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణం ఇందిరానగర్‌కు చెందిన పెయింటర్ జెర్రిపోతుల మల్లేశం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ నెల 14న స్థానిక ఖాజిమహల్లాలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆతడిని గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మల్లేశంకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

మాడ్గులపల్లి, జూలై 12 : గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామశివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ శోభన్‌బాబు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వేములపల్లి మండల కేంద్రానికి చెందిన మల్లికంటి రాములు, త్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారం గ్రామానికి చెందిన మల్లికంటి శ్రీనులు వేములపల్లిలోని సమీప బంధువు చనిపోవడంతో అంత్యక్రియలకు హాజరై తిరిగి మాడ్గులపల్లి వైపు టీవీఎస్ మోపెడ్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో ఇద్దరిని మిర్యాలగూడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శ్రీను పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో హైద్రాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. శ్రీను కుమారుడు దినేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

లారీ ఢీకొని ఒక వ్యక్తికి..

పాలకవీడు, జూలై 12 : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య సంఘటనా స్థలానికి చేరుకోని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన షాబుద్దీన్(42) శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై జాన్‌పహాడ్ దర్గాలో తన బంధువుల కందూరుకు హాజరై వస్తుండగా పాలకవీడు మండలం కోమటికుంట గ్రామం శివారులో లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైనట్లు తెలిపారు. షాబుద్దీన్‌కి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. లారీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మేకల దొంగలకు జరిమానా

రామన్నపేట, జూలై 12 : మేకలను దొంగిలించిన ఇరువురికి యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్ జరిమానా విధించారు. ఒక్కొక్కరికీ రూ.6 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. మునిపట్ల గ్రామానికి చెందిన భూషపాక పురుషోత్తం(25) షాకపురం నవీన్(25)లు మోత్కూరు మండలం బుజిలాపురం, పాటిమట్ల గ్రామాల్లో మేక పోతులను దొంగతనం చేసి 2022లో అరెస్టయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దొంగతనానికి సంబంధించిన సాక్ష్యాలను రామన్నపేట కోర్టులో ప్రవేశపెట్టారు. రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్ కేసు విచారణ చేసి, పోలీసులు ప్రవేశపెట్టిన సాక్ష్యాధారాల ఆధారంగా దోషులు ఇద్దరికి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేములపల్లి, జూలై 12: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న మూడు ట్రాక్టర్లన పట్టుకుని కేసు నమోదు చేసినట్లు నల్లగొండ జిల్లా వేములపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. రావులపెంట గ్రామానికి చెందిన ఉత్తెర్ల నరేష్, పిట్టల ప్రవీణ్, పజ్జూరు లింగస్వామి మూసీ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేషన్ డీలర్లు బియ్యం కొంటే లైసెన్స్ రద్దు

చిట్యాల రూరల్, జూలై 12 : లబ్ధిదారుల నుంచి డీలర్లు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామని పౌర సరఫరాల శాఖ డీటీలు దున్న లింగస్వామి, ఎస్‌కే బీ జావిద్, జ్యోతి హెచ్చరించారు. శుక్రవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని వనిపాకల, వట్టిమర్తి గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. బియ్యం నిల్వలు, రికార్డుల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదనపు కలెక్టర్, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి ఆదేశానుసారం రేషన్ దుకాణాలను తనిఖీ చేస్తున్నామన్నారు. లబ్ధిదారులకు పంపిణీ చేసే బియ్యాన్ని డీలర్లు కొనుగోళ్లు చేస్తున్నారనే సమాచారం వచ్చిందన్నారు. డీలర్లు లబ్ధిదారులకు బియ్యాన్ని పంపిణీ చేసే సమయంలో కొనుగోళ్లు చేసినట్లయితే వారి లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. అంతేకాకుండా ఆయా డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న బియ్యాన్ని లబ్ధిదారులు విక్రయిస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని, చర్యలే కాకుండా వారి రేషన్‌కార్డులను రద్దు చేస్తామన్నారు. రేషన్ బియ్యాన్ని విక్రయించినా, కొనుగోలు చేసినా చర్యలు ఉంటాయన్నారు.

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

పెద్దఅడిశర్లపల్లి, జూలై 12 : నల్లగొండ జిల్లా గుడిపల్లి మండలంలోని భీమనపల్లి గ్రామంలోని రేషన్ దుకాణంపై శుక్రవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్ అధికారులు దాడులు నిర్వహించారు. సరుకులు అక్రమంగా పక్కదారి మళ్లిస్తున్నారన్న ఆరోపణల మేరకు దాడులు నిర్వహించారు. 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వల్లో వ్యత్యాసం ఉండటంతో డీలర్ టీ విలమ్మపై 6-ఏ కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



ఈరమ్మ

తిప్పర్తి, జూలై 12 : కూలి పనులకు వెళ్లిన వివాహిత అదృశ్యంపై నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి గ్రామానికి చెం దిన బండారు శివకృష్ణ తన భార్య ఈరమ్మతో కలిసి నాలుగేళ్ల కిందట తిప్పర్తి గ్రామానికి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ ఉంటున్నాడు. వీరికి మూడేళ్ల బాబు ఉన్నాడు. ఈ నెల 9వ తేదీన ఈరమ్మ కూలీ పనులకు వెళ్తున్నానంటూ ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శివకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

కుళ్లిన స్థితిలో వ్యక్తి మృతదేహం



నరసింహాచారి(ఫైల్)

అడ్డగూడూరు, జూలై 12: యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని చౌళ్లరామారం గ్రామంలో శుక్రవారం కుళ్లినస్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చౌళ్లరామారం గ్రామానికి చెందిన దోంతోజు నరసింహాచారి(45)బుధవారం తన ఇంట్లో రాత్రి రోజువారీగా మద్యం తాగి పడుకున్నాడు. శుక్రవారం నరసింహాచారి ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో ఇరుగు పొరుగు వారు కిటికీ లను తెరిచి చూడగా నరసింహాచారి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. భార్య రమ వారం రోజుల కిందట హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న తన పిల్లలు ప్రవీణ్, పూజితల వద్దకు వెళ్లింది. విషయం తెలుసుకున్న వారు గ్రామానికి చేరుకున్నారు. శుక్రవారం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కూలీ ఆత్మహత్య

వలిగొండ, జూలై 12 : ఆర్థిక ఇబ్బందులతో కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని టేకులసోమారం గ్రామానికి చెందిన చేగూరి శ్రీనివాస్(45) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్య, వివాహితులైన కుమార్తె, అవివాహితులైన ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండేళ్ల కిందట కుమార్తె వివాహం కోసం దాదాపు రూ.5లక్షలు ఖర్చుచేశాడు. ఇతరుల దగ్గర నుంచి తీసుకువచ్చిన అప్పులు తిరిగి చెల్లించలేక మనస్తాపానికి గురై గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. అతడి కుమారుడు ఇంటికి వచ్చి చూసే సరికి విగతజీవితగా పడిఉన్నాడు. భార్య అరుణ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వన మహోత్సవానికి ప్రణాళిక సిద్ధం చేయాలి : పీడీ

నార్కట్‌పల్లి, జూలై 12: ఊరూరా మొక్కలు నాటే కార్యక్రమం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి సూచించారు. నార్కట్‌పల్లి మండలంలో ఈ వనమహోత్సవం కార్యక్రమం కింద 68 వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించాలని, అదే సమయంలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించేలా చూడాలని ఆదేశించారు. వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. అర్జీదారుల సమస్యలు మండల పరిధిలోనే ఉంటే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో ఉమేష్‌చారి, ఎంపీవో సుధాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

నల్లగొండ టౌన్, నల్లగొండ క్రైం, జూలై 12: విద్యార్థులు డ్రగ్స్ మాదక ద్రవ్యాలకు, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని నల్లగొండ వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని సాగర్ ఎక్స్‌రోడ్డులో గల శ్రీచైతన్య హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, సోషల్‌మీడియా, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలు అవసరమైన మేరకే వాడాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై అవగాహన కలిగి జాగ్రత్తగా ఉండాలన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, స్పందించాల్సిన విధానంపై షార్ట్ ఫిలింలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చిలువేరు యాదయ్య, యాస శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం త్రిమూర్తి, కుక్కపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

● సీఎం రేవంత్‌రెడ్డికి జూలకంటి వినతి


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రంగారెడ్డి

మిర్యాలగూడ, జూలై 12: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన కలిసి రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. భూమాత పథకంలో లోపాలను గుర్తించి వాటిని సవరించి అందరికీ పాస్‌పుస్తకాలు అందించాలని, సమగ్ర భూసర్వే నిర్వహించి గ్రామసభల ద్వారా లోపాలను సవరించాలన్నారు. 2011 కౌలు చట్టాన్ని అమలు చేయాలని, ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని రూపొందించి పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని అన్నారు. ప్రాధాన్యత క్రమంలో సాగునీటి పథకాలను పూర్తి చేయాలని, రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని, అన్ని పంటలకు మద్దతు ధరతో పాటు బోనస్ అందించాలని కోరారు. లీటర్ పాలకు రూ.5 బోనస్ అందించాలన్నారు. అదేవిధంగా రూ.2లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు శోభన్, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

బేకరీల్లో పరిశుభ్రత పాటించాలి


హాలియాలో బేకరీని పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్

హాలియా, జూలై 12: బేకరీ షాపుల్లో పరిశుభ్రత పాటించాలని హాలియా మునిసిపల్ కమిషనర్ ఎండీ మున్వర్‌అలీ అన్నారు. పట్టణంలోని పలు బేకరీలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేకరీల్లో పరిశుభ్రత పాటించాలని అన్నారు. శీతల పానీయాలు, తినుబండారాల యొక్క గడువు తేదీ ముగిసిపోయిన వాటిని విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొని జరిమానాలు విధించి షాపులను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రజలకు కల్తీ లేని నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవికుమార్, బిల్ కలెక్టర్లు ఉమర్, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ కుడి ప్రధాన కాల్వను ఆధునికీకరించాలి


ధ్వంసమైన 10వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కేతేపల్లి, జూలై 12: మూసీ ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వపై గల డిస్ట్రిబ్యూట రీ వ్యవస్థ పూర్తిగా శిథిలావస్థకు చేరిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి కేతేపల్లి మండల పరిధిలోని కుడి ప్రధాన కాల్వపై గల పలు డిస్ట్రిబ్యూటరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా చీకటిగూడెం సమీపంలోని 10వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీకి బుంగపడి ఉండటం, డిస్ట్రిబ్యూటరీ కాల్వ ఆనవాళ్లు లేకపోవడం చూసి ప్రాజెక్టు అధికారులు, రైతులకు సక్రమంగా సాగునీరు అందించాలనే ధ్యా స లేకుండా పోయిందని విమర్శించారు. వెంటనే డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను ఆధునికీకరించేలా ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.మారయ్య, నాయకులు ఎల్.రాజు, కోట లింగయ్య, సాదె నాగయ్య, ఎన్.సత్యం ఉన్నారు.

బదిలీ అయిన టీచర్లకు ఆత్మీయ వీడ్కోలు


కనగల్: ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న విద్యార్థులు

కనగల్, త్రిపురారం, తిరుమలగిరి(సాగర్), జూలై 12: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఎక్కడ విధులు నిర్వహించినా బాధ్యతగా పనిచేయాలని ఎంఈవో రాము, మండల నోడల్ అధికారి శ్రీనివాస్, పలువురు హెచ్‌ఎంలు సైదిరెడ్డి, వెంకన్న అన్నారు. జిల్లాలో పలు పాఠశాలల్లో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఇతర పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులను శుక్రవారం ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. మెమెంటోలతో, శాలువాలతో, పూలమాలలు ఘనంగా సన్మానించారు.

● కనగల్ మండలంలోని కుంరపల్లి పాఠశాలలో పనిచేస్తూ హెచ్‌ఎంగా పదోన్నతి పొంది బదిలీ అయిన ఉపాధ్యాయుడు మురారిశెట్టి రమేష్, మరో ఉపాధ్యాయురాలు హైమావతిని సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు పుష్పలత, విజయ్‌కుమార్, యాదగిరి పాల్గొన్నారు.


త్రిపురారంలో ఉపాధ్యాయులకు సన్మానం

● త్రిపురారం మండలంలోని చెన్నాయిపాలెం జడ్పీ హైస్కూల్ నుంచి ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు మక్లనాయక్, శ్రీదేవి, దుర్గామల్లేశ్వరిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శ్రీనివాస్, లక్ష్మి, ఝాన్సీ, లలిత, జ్యోతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్ల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, యశోద, జానీపాషా, రామాంజిరెడ్డి, రవీందర్, నాగమణి, శ్రీలక్ష్మిని ఘనంగా సన్మానించారు.

అవంతీపురంలో అస్తవ్యస్తంగా పారిశుధ్యం

- పట్టించుకోని గ్రామ ప్రత్యేకాధికారి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు

మిర్యాలగూడ రూరల్, జూలై 12: పట్టణానికి మిర్యాలగూడ కూత వేటు దూరంలో ఉన్న గ్రామపంచాయతీ అభివృద్ధికి ఆమడదూరంగా నిలిచింది. మండలంలోని అవంతీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని జంగాలకాలనీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. వర్షాకాలం మొదలైందంటే సీజనల్ వ్యాధులతో కాలనీవాసులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. వేలకు వేలు ఆస్పత్రుల్లో ఖర్చు చేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభమవడంతో కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సిన గ్రామ పంచాయతీ అధికారి పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీలు పూడిపోయి అవంతీపురం గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీల్లో ఒక వైపు మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో దోమల వృద్ధి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీరు డ్రైనేజీల్లో పిచ్చిమొక్కలు పెరగడంతో మురుగు వెళ్లకుండా అడ్డుపడుతున్నాయి. అంతేకాక ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రైనేజీలు పూడిపోయి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో మురుగునీరు నిల్వ ఉండటంతో పాటు వీధుల్లో ప్రవహిస్తున్నాయి. చర్యలు తీసుకోవాల్సి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నార న్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డ్రైనేజీల్లో బ్లీచింగ్ చల్లకపోవడంతోపాటు గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదని, మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత గ్రామ పాలనాధికారి ప్రజాసమస్యలపై దృష్టి సారించి నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. జంగాల కాలనీలో నెలకొన్న సమస్యలపై పంచాయతీ కార్యదర్శి గాయత్రిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె స్పందించలేదు. గ్రామ ప్రత్యేకాధికారి సెలవులో ఉన్నారు.


డ్రైనేజీలో నిలిచిపోయిన మురుగునీరు


పిచ్చిమొక్కలు పెరిగి నిరుపయోగంగా మారిన డ్రైనేజీ

కాలనీల్లో పరిస్థితి అధ్వానం



జంగాల కాలనీలో వర్షాకాలం వస్తుందటే భయమవుతుంది. దోమలు విపరీతంగా పెరిగి జ్వరాల బారినపడుతున్నాం. అధికారులు డ్రైనేజీలను శుభ్రం చేయాలి. డ్రైనేజీల్లో పూడికతీత పనులను చేపట్టి ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా చూడాలి. కాలనీల్లో డ్రైనేజీలు లేక వీధుల్లోనే మురుగునీరు ప్రవహిస్తుండటం ఇబ్బందిగా ఉంది.

● గంజాయి వెంకటయ్య, జంగాల కాలనీ

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రతీ గురువారం ప్రజావాణిలో శానిటేషన్, హెల్త్, ఇతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ కార్యదర్శులు కృషి చేయాలి.

● శేషగిరిశర్మ, మిర్యాలగూడ ఎంపీడీవో

పేద విద్యార్థుల కోసమే 'ఉద్దీపన'


ఉద్దీపన పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

నకిరేకల్, జూలై 12: ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు పడుతున్న పిల్లల కోసమే ఉద్దీపనను ఎమ్మెల్యే వేముల వీరేశం ఏర్పాటు చేశారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నకిరేకల్‌లోని వీవీఎం స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్దీపన స్కూల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ఉద్దీపనతో పేద విద్యార్థులకు అన్ని విధాలుగా ఆంగ్లభాష నేర్పించేందుకే కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పేద విద్యార్థిని బలోపేతం కోసం నిరంతరం ముందుంటారన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్యే బీఎల్‌రెడ్డి, ప్రెస్ అకాడమీ శ్రీనివాస్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పథకాలు వర్తింపజేయాలి

గట్టుప్పల్, జూలై 12: కౌలు రైతులకు రైతు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రుణ గుర్తింపుకార్డులు ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. గట్టుప్పల్ మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో శుక్రవారం కౌలు రైతుల సమస్యలపై సర్వే నిర్వహించారు. సర్వే ప్రతినిధి బృందానికి కౌలు రైతుల సమస్యలు వివరించారు. కౌలు రైతులకు పంట రుణాలు, రైతుబంధు, రుణమాఫీ, ప్రభుత్వమే అందజేయాలని సర్వే బృందానికి వివరించారు. ప్రతీ గ్రామంలో 100 నుంచి 120మంది కౌలు రైతులు ఉన్నారని అన్నారు. వారికి ప్రభుత్వం నుంచి పంట రుణాలు అందడం లేదని, ప్రైవేట్ అప్పుల మీదనే ఆధారపడి వ్యవసాయాన్ని సాగు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ సమస్యలను పరిష్కారం చేయకపోవడం వల్ల రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సాగు చేసే రైతులందరికీ వయస్సుతో నిమిత్తం లేకుండా రైతుబీమా వర్తింపజేయాలని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్.మారయ్య, జి.శౌరెడ్డి, వల్లూరి మల్లేశం, ఎట్టయ్య, టేకుమెట్ల కృష్ణ, భీమనపల్లి నరసింహ, పెంటయ్య, చింతకాయల సత్తయ్య, బి.మహేష్ పాల్గొన్నారు.

ప్రజలు విరివిగా మొక్కలు నాటి పెంచాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


ఇందిరమ్మ కాలనీలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, జూలై 12: ఊరూరా వనాలు ఉంటేనే వానలు కురుస్తాయని, అందుకే ప్రజలు విరివిగా మొక్కలను నాటి వాటిని బాధ్యతగా పరిరక్షించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మునిసిపాలిటీ ఆధ్వర్యంలో 6వ వార్డు ఇందిరమ్మ కాలనీలో ఫేజ్ 4లో మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. నీరు, గాలి జీవకోటికి ప్రాణాధారమని అన్నారు. నీరు,గాలి వనాల వల్లే లభ్యమవుతాయని పేర్కొన్నారు. కాలుష్యం నుంచి ప్రాణులను మొక్కలు రక్షిస్తాయన్నారు. ఇంటికో చెట్టు వీధికో వనం అన్నట్లుగా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. ప్రభుత్వం అన్ని గ్రామాల్లో నర్సరీల ద్వారా ప్రజలకు మొక్కలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కాలనీలో 300 మొక్కలు నాటారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన పారిశుధ్య పనులు

'నేను నా మిర్యాలగూడ' కార్యక్రమంలో భాగంగా పట్టణంలో రెండో రోజూ స్వచ్ఛందంగా పారిశుధ్య పనులు కొనసాగించారు. 2,5,7,9,13,19,23,25,27,33,43,46 వార్డుల్లో కౌన్సిలర్లు, పార్టీ ఇన్‌చార్జీలు పారిశుధ్య కార్మికులతో కలిసి డ్రైనేజీ క్లీనింగ్ పనులు కొనసాగించారు. 5వ వార్డు ఈదులగూడలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ నేను నా మిర్యాలగూడ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలు ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. సమష్టి నిర్ణయాలతో సమర్థవంతంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయవచ్చని మిర్యాలగూడ ప్రజలు నిరూపిస్తున్నందుకు ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బండి యాదగిరిరెడ్డి, మంత్రాల రుణాల్‌రెడ్డి, రవినాయక్, మునిసిపల్ సూపర్‌వైజర్ పావని, వార్డు జవాన్ బిక్షం, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

డిండి, జూలై 12: ఆత్మహత్య చేసుకున్న ఎస్ఐ శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ముదిగొండ ఎల్లేష్ మాదిగ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లా అశ్వరావుపేట ఎస్ఐ శ్రీనివాస్ మృతికి కారణమైన సీఐ జితేందర్‌రెడ్డిని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దళితులను, దళిత ఉద్యోగులను వేధిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. సమావేశంలో నాయకులు మేడి పాపన్న, కొమ్మనేటి పాలు, ఎర్ర యాదగిరి, ముడి శ్రీను, మైనర్‌బాబు, జార్జ్, యోగి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థిని మృతికి కారణమైన వారిని శిక్షించాలి'

మాడ్గులపల్లి, జూలై 12: మండలంలోని కుక్కడం గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలగూడెం గ్రామానికి చెందిన విద్యార్థిని మృతికి కారణమైన కొమ్మనబోయిన మధు, ఆరూరి శివలను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యార్థిని కుటుంబసభ్యులను పరామర్శించి ఆమె మాట్లాడారు. నిత్యం మహిళలపై దాడులు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలను తీసుకొచ్చినా వాటిని అమలుచేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధని, సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, నాయకులు తుమ్మల పద్మ, తంగెళ్ల నాగమణి, శ్రీకర్, సుకన్య, కౌసల్య, వెంకన్న, సైదులు, రవి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్థులు

పెద్దఅడిశర్లపల్లి, జూలై 12: అంగడిపేట గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న నారాయణదాసు రాంబాబు ఈ నెల 1వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో తలకు తీవ్రగాయమై కోమాలోకి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలించి సర్జరీ చేయించారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న అంగడిపేట గ్రామ పంచాయతీ 'మానవ సేవే మాధవసేవ' గ్రూప్ సభ్యులు రూ.60వేలు ఆర్థికసాయాన్ని శుక్రవారం రాంబాబు భార్య పూజకు అందించారు. గ్రామ పంచాయతీలో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గ్రామ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు అందరితో కలిసిమెలిసి ఉండటంతో ప్రతి ఒక్కరూ ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాంబాబు త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిత్తరంజన్‌రెడ్డి, వీరమళ్ల సతీష్‌కుమార్, పున్న విజేందర్, కిషోర్, కోటి, సోమ కల్పన, ముత్తుకన్న అభినయ, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి


నిడమనూరులో టీచర్లకు సభ్యత్వాలు అందజేస్తున్న నాయకులు

కేతేపల్లి, నిడమనూరు, జూలై 12: ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలతో ఏర్పడిన ఖాళీలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీఎస్ యూటీఎఫ్ పని చేస్తుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి, యాట మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు టి.నర్సింహమూర్తి, జిల్లా కార్యదర్శి నలపరాజు వెంకన్న అన్నారు. శుక్రవారం జిల్లాలోని కేతేపల్లి, నిడమనూరు మండలాల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం తమ సంఘం మొదటి నుంచి పోరాటం చేస్తుందన్నారు. విద్యార్థులు ఎక్కువ ఉన్న చోట అదనపు ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ లీవ్, జీపీఎఫ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

● కేతేపల్లిలో నిర్వహించిన సమావేశంలో సంఘం నాయకుల మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లు, సర్వీసు పర్సన్లు లేక పాఠశాలల్లో పరిశుభ్రతను పట్టించుకునే వారు లేకుండా పోయారన్నారు. పాఠశాలలకు సర్వీసు పర్సన్లను నియమించాలని, మోడల్ స్కూల్, కేజీబీవీల్లో బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.మధు, ఆర్.రఘు, సంఘం సీనియర్ నాయకులు సీహెచ్.వీరభద్రయ్య, శ్రీనివాస్, రమేష్, నాగయ్య, వి.గోపయ్య, శ్రీధర్, చంద్రశేఖర్, జయసాగర్ తదితరులు పాల్గొన్నారు.

● నిడమనూరు మండలంలోని ఎర్రబెల్లి, ముప్పారం, జంగాలవారిగూడెం, ఎర్రగూడెం, నిడమనూరు కేజీబీవీ, మైనార్టీ పాఠశాలలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కొమ్మరాజు సైదులు, లింగంపల్లి అంజయ్య, బొమ్ము ఉపేందర్, వేదశ్రీ, వెంకన్న, యాదగిరిరెడ్డి, వెంకన్న, యాదగిరి పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

కట్టంగూరు, జూలై 12: నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో పి.జ్ఞానప్రకాశ్‌రావు అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో గల గంగదేవమ్మ గుడి ఆవరణలో ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, భావితరాలకు మనం ఇచ్చే సంపద చెట్లు నాటడమేనని అన్నారు. మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో 52,140 మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రధాన భూమిక పోషించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వడ్లకొండ అశోక్, ఏపీవో కడియం రాంమోహన్, టీఏ భూషన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

నిడమనూరు: నిడమనూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉన్నందున సబ్‌స్టేషన్ పరిధిలోని నిడమనూరు, శాఖాపురం, పార్వతీపురం, బంకాపురం, వెనిగండ్ల, మార్లగడ్డక్యాంపు, రాజన్నగూడెం, నర్సింహులగూడెం గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చిట్యాల: నకిరేకల్‌లో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జిట్ట సురేష్ కోరారు. చిట్యాలలో శిక్షణ తరగతుల ప్రచార పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జిట్ట దినేష్, చరణ్, పవన్, విజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని గొడుకొండ్ల గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని పంచాయతీ కార్యదర్శి పద్మ అన్నారు. వెంకటేశ్వరనగర్‌లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కొండమల్లేపల్లి: పట్టణంలోని సాగర్ రోడ్డులోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వన మహోత్సవవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు మొక్కలు నాటే ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆనంద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఫర్హీన్‌సుల్తానా, ఉపాధ్యాయులు బాలయ్య, సుష్మా, శ్రీలత, సంధ్య, సువర్ణ, ఉమా శైలజ పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లి మండలంల తీదేడు జడ్పీ హైస్కూల్‌లో పదోన్నతిపై బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ మేరకు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేందర్, గ్రామస్థులు పాండురంగరావు, మాజీ సర్పంచ్ దాసరి శ్రీనివాస్‌యాదవ్, వెంకట నర్సింహారావు, శ్రీనివాస్‌రెడ్డి, టీచర్లు వాసుదేవరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: మహిళా కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నల్లగొండ పట్టణానికి చెందిన కందిమళ్ల నాగమణిరెడ్డిని నియమించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి వెంకట్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు.

శాలిగౌరారం: ఎమ్మెల్యే మందుల సామేల్‌ను అనాలోచితంగా విమర్శించడం అవివేకమైన చర్య అని తెలంగాణ స్టూడెంట్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రింగు రాంబాబు అన్నారు. ఎమ్మెల్యే సామేల్ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొద్దిమంది విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు దేవరకొండ మస్తాన్, తాటిపాముల నర్సింహ, జానీయాదవ్ పాల్గొన్నారు.

దామరచర్ల: దామరచర్ల రైల్వేస్టేషన్ పునరుద్ధరణకు కృషి చేయాలని మిర్యాలగూడ అసెంబ్లీ ప్రబారి బోగిరెడ్డి లచ్చిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి సాధినేని శ్రీనివాస్ హైదరాబాద్‌లో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కలిసి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన వారు రైల్వేస్టేషన్ పునరుద్ధరణకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జానకిరాంరెడ్డి, నాయకులు బాల లక్ష్మీ సత్యనారాయణ, సైదారావు, బంగారు, సైదిరెడ్డి, బ్రహ్మచారి పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): మండలకేంద్రంలో కస్తూర్బాగాంధీ విద్యాలయ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరె రమేష్ కోరారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందేశారు.

చిట్యాలరూరల్: మండలంలోని పిట్టంపల్లి, పేరేపల్లి, గ్రామాల్లోని ప్రాథమికోన్నత, బొంగోనిచెర్వులోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు వెలిమినేడు శివారులోని హెటిరో ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూనిఫారాలు, బ్యాగులు, నోట్ పుస్తకాలతో పాటు పాటు విద్యా సామగ్రిని హిండీస్ ఫార్మా యాజమాన్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పంతంగి కరుణాకర్‌గౌడ్, సులోచన, ధనలక్ష్మి, ఫార్మా కంపెనీ ప్రతినిధులు సురేష్, కరుణాకర్, ఉపాధ్యాయులు జయంతిమాల, దయాకర్ పాల్గొన్నారు.

శాలిగౌరారం, మునుగోడురూరల్: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగరిగారి ప్రీతంను ఆయన ఛాంబర్‌లో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎస్సీ నాయకులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా మాజీ చైర్మన్ పెరికె వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు యేకుల సురేష్, నాయకులు చింతపల్లి బాలకృష్ణ, శాలిగౌరారం ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పెరుమాండ్ల నరేష్, అవుట మల్లేష్, తీగల నవీన్, అనిల్, శేఖర్ పాల్గొన్నారు.

చండూరు రూరల్: చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన తీగల శ్రీరాములు ఓయూ డాక్టరేట్ అందుకున్నారు. శ్రీరాములు ప్రొఫెసర్ డాక్టర్ కె. శ్రీను ఆధ్వర్యంలో చండూరు మండలంలో భూగర్భ జలాల నాణ్యత, భూ వినియోగం, భూమి అంచనా వంటి అంశాలపై చేసిన పరిశోధనకు జియాలజీ విభాగంలో ఓయూ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు.

చండూరు రూరల్: మండలంలోని బంగారిగడ్డ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బోయపల్లి రమేష్ గౌడ్‌ను తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

కనగల్: కనగల్ మండలకేంద్రానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త కంబాల శివలీలారెడ్డికి మనం ఫౌండేషన్ పద్మ ప్రతిభా పురస్కారంతో పాటు గౌరవ ప్రశంసాపత్రం దక్కింది. హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు సుమన్, మనం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చక్రవర్తి ఆమెకు పురస్కారాలను అందజేశారు.

మర్రిగూడ: పారిశుధ్య నివారణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రాథమిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దీపక్ అన్నారు. మండలంలోని ఖుదాభక్షపల్లి, సరంపేట గ్రామాల్లో వీధులను పరిశీలించి పారిశుధ్య నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి ఎదుట మురుగునీరు లేకుండా చూసుకోవాలని అన్నారు. ఇతర వ్యాధులపై పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.